# పిరికిమనిషి

'దమయంతి'



గుమ్మానికి ఎదురుగా వాలుకుర్చీలో కూర్చుని బయటికి చూస్తున్నాడు శ్రీపతి. వర్షం ధారలుగా కురుస్తోంది. పొద్దు గూకుతుండగా వచ్చే చుట్టంలా పొద్దున్నే పట్టుకున్న వర్షం తగ్గేలా లేదు. పిల్లలు ముగ్గురూ గదిలో ఒక పక్కగా కూర్చుని చదువుకొంటున్నారు.

అక్కడి నుంచి చూస్తే లోపల పనితో సతమతమవుతున్న రేవతి కనబడుతోంది. తొలి చూలుతో భారంగా తిరుగుతూ పని చేసుకొంటున్న రేవతిని చూశాడు శ్రీపతి. ఆలోచిస్తున్న శ్రీపతి చేతిలో పేపరు జారి కిందపడింది.

వంటింట్లోనుంచి పెద్ద గిన్నెతో వేడి నీళ్ళు బాత్రూంలోకి తీసుకువెళుతోంది రేవతి. శ్రీపతి చూస్తూ కూర్చున్నాడు. లేచి వెళ్ళిఆమె చేతిలో నీళ్ళగిన్నె అందుకుందా మనుకునేంతలో రేవతి వెళ్ళిపోయింది.

---

*పిలవని పేరంటంలా పిరికితనం సమయానికి రాకపోతే—*

---

పిల్లల్నిఒక్కొక్కరినే పిలిచి స్నానాలు చేయిస్తోంది. రేవతికి పిల్లలపట్ల ఉన్న ప్రేమకి అభిమానంగా ఆమెవంక చూశాడు శ్రీపతి. కాని, ఆమె కష్టపడుతోందని తెలిసినా లేచి వెళ్ళి సహాయం చెయ్యాలనిపించడం లేదు. కదలకుండా కుర్చీలో కూర్చునే రేవతిని గమనిస్తున్నాడు. శ్రీపతి.

కత్తిపీట ముందు కూర్చుని కూరగాయలు తరుగుతున్నప్పుడూ, నీళ్ళ బక్కెట్లు మోస్తున్నప్పుడూ, మాటి మాటికీ కిందికి వంగి అవీ ఇవీ అందుకొంటున్నప్పుడు లేచి వెళ్ళి సహాయం చెయ్యాలనిపించినా లేచి వెళ్దామని నిర్ణయించుకొనేంతలో రేవతి ఆ పని చేసేసుకుంటోంది.

రేవతిని ఏడు నెలల క్రితం రెండో పెళ్ళి చేసుకున్నాడు శ్రీపతి.

సీత చచ్చిపోయినప్పుడు మళ్ళీ పెళ్ళి చేసుకోవా లనుకోలేదు శ్రీపతి. ముగ్గురు పిల్లలతో పని చేసుకుని ఆఫీసుకి వెళుతున్నప్పుడూ మళ్ళీ పెళ్ళి చేసుకోవాలన్న తలంపు కలగలేదు అతని కెప్పుడూ. పచ్చగా బొద్దుగా ఉన్న రేవతిని చూసి



బందరువద్ద మంగినపూడిలో ఉప్పెన తాకిడికి మరణించి ఒడ్డుకు కొట్టుకు వచ్చిన శవాలు

నప్పుడు కూడా రేవతిని చేసుకుంటే బాగుండునన్న ఆలోచన రాలేదు శ్రీపతికి.

శ్రీపతి వయసు ముప్పై. ఉద్యోగం చేస్తున్నాడు.

మొదటి భార్యకు ముగ్గురు పిల్లలున్నా, శ్రీపతికి పెళ్ళాం అవసరం ఎంతైనాఉంది అన్న సంగతిని అతనికంటె ముందు అతని స్నేహితులూ, ఊళ్ళోవాళ్ళూ గ్రహించారు. అందుకే బలవంతంగా రేవతినిశ్రీపతి చేసుకునేలా చేసి తమ బాధ్యత తీరిపోయినట్లుగా తప్పుకున్నారు.

రేవతిని చేసుకున్న తర్వాత తను చేసిందీ మంచిపనే అన్న ఆలోచన రాక పోలేదు శ్రీపతికి. కారణం తనంటే రేవతికి బోల్డు ప్రేమ. రేవతి తనని ఆరాధిస్తోం దని తెలుసుకున్నాడు. తన అవసరాల్ని చెప్పకుండానే గ్రహించి చేసుకుపోతుంది. అన్నిటినీ మించి తన పిల్లల్ని ప్రాణంలా చూసుకుంటోంది.

అంతకంటె కావల్సిందేముంది; కానీ రేవతి వయసు పాతికలోపే. చూడ్డానికి చక్కగా వుంటుంది. రెండో పెళ్ళివాడనీ ముగ్గురు పిల్లలున్నారనీ తెలిసీ తనని ఎందుకు చేసుకోడాని కిష్టపడిందో మాత్రం అర్థంకాలేదు శ్రీపతికి. ఆ మాటే అడిగాడు కారణం తెలుసుకుందామని.

"బాగుంది, మీరు బాగుండరని ఎవ రన్నారూ? అయినా అందం ఏం చేసు కోను? మనసు మంచిదైతే చాలదూ?" అంది రేవతి.

శ్రీపతి నవ్వాడు.

"నా మనసు సంగతి నీకు అప్పుడే తెలిసిపోయిందన్నమాట," అన్నాడు.

"ఇప్పుడేమిటి, మిమ్మల్ని చూసినప్పుడే తెలిసిపోయింధి" అంది.

"ఏమని?" అడిగాడు.

"చాలా మంచివారని, దేవుడులాంటి వారని."

"అయితే నామీద ఛాలా నమ్మకం ఉంది నీకు" అన్నాడు.

"అవును ఉంది. భార్యకి భర్తమీద నమ్మకం ఉండాలి. విశ్వాసం ఉండాలి. అవి లేకపోతే కష్టం" అంది.

రేవతిపట్ల తనకీ చాలా ప్రేమ ఉందని చెప్పాలనుకున్నాడు. కానీ వ్యక్తంచేయలేక పోయాడు. అదే అతనిలో ఉన్న బలహీనత. అతనిలో ఉన్న ఆ గుణమే కోరిక తీరకుండా సీతని చంపేసేలా చేసింది. సీతకి తనంటే ప్రాణం. తన ప్రేమను ఎన్నో విధాలుగా వ్యక్తంచేసేది. సీత అంటే శ్రీపతికీ ప్రాణంతో సమానమే. కానీ తన ప్రేమని ఏ విధంగానూ వ్యక్తం చేయలేక పోయేవాడు. అతని మనసు తెలుసుకోలేక సీత చాలా బాధపడేది. చివరిక్షణం వరకూ కూడా "నువ్వే నా ప్రాణం సీతా" అని చెప్పాలనుకున్నాడు కానీ, ఆమాట గొంతు దాటి బయటికి రానేలేదు. సీతకి ఆ సంగతి తెలియకుండానే వెళ్ళిపోయింది. శ్రీపతి జుట్టు పీక్కున్నాడు. ఎప్పుడూ అంతే. తను చెప్పాలనుకున్నది చెప్పలేదు. చెయ్యాలనుకున్నదిచెయ్యలేదు.

వర్షం జోరుగా కురుస్తోంది. ఆ వర్షంలో ఆఫీసుకి వెళ్ళడం ఎలాగా అని ఆలోచేస్తు

ఉచితము ! ఉచితము !

తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక పాకెట్ మందు పొందండి.

LALIT AYURVEDIC PHARMACY (AJ)
P. o. Katri Sarai (GAYA)

వస్త్రాల విషయంలో స్త్రీల అభిరుచులకు
అనుగుణ్యమైన ప్రత్యేక నిలయం

వనిత శారీ సెంటర్

కొత్తగూడెం

అందరినీ అలరించే సినీ వారపత్రిక
"జ్యోతిచిత్ర" చదవండి

శుభవార్త



నాడి ప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు
డా॥ ఎస్. ఎస్. రావు, M.B.H., R.M.P.
గారిని సంప్రదించండి
రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,
చింతలబస్తీ, 6-2-961, ఖైరతాబాద్.
హైదరాబాద్—500 004. (ప్రీమియర్ కేఫ్ సందులో)

శరీర బలహీనత, పూటగా పెరుగుటగాని, చిన్నప్పటినుండి సన్నముగా నుండి ఏ మందువలన లావు కాకపోవుటగాని, అంగములు వుండవలసిన సైజులో వుండకపోవుట, నరముల బలహీనత, మానసిక వ్యాధులు, పిట్సు, భయం, గుండెదడ, రక్త ప్రసరణ ఎక్కువ కావటం లేక తక్కువ గావడం, సర్వ విధములగు దగ్గులు, ఉబ్బసం పొత్తి కడుపు ఎత్తుగా పెరగడం, జలోదరం, కడుపు నొప్పి, గ్యాస్టిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలిచేరుట, స్త్రీల ముట్టుకుట్టు నొప్పి, కుసుమవ్యాధి, (ఏ రంగైనా సరే), మూత్ర వ్యాధులు, మూలశంక, వరిబీజం, సుఖవ్యాధులు, స్త్రీలకుగాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకపోవుట, వీపు నొప్పి, నడుము నొప్పి, కీళ్ళ వ్యాధులు, వాపు, నీరు చేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట, బోదవాపు, జ్వరం, పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా పరిణమించినప్పుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు, తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించుకాలము : ఉదయం 7 గంటల నుండి సా॥ 5 గంటల వరకు
పరీక్ష ఫీసు రు. 12/- చికిత్సకు అదనం.

క్యాంపు : నవంబరు నెల 4 వ తేదీ కర్నూలు, రవిప్రకాశ్ లాడ్జి, 5వ తేదీ అనంతపూర్ హోటల్ సప్తగిరి, 6వ తేదీ : గుంతకల్, శ్రీలాడ్జి, 7వ తేదీ కడప, ప్రతాప్ లాడ్జి స్టేషన్ రోడ్, 8వ తేదీ తిరుపతి, భీమాస్ అనెక్స్ లాడ్జి, 9వ తేదీ మదనపల్లి, శ్రీలాడ్జి, 10వ తేదీ : చిత్తూరు, M. S. R. లాడ్జి, 11, 12 తేదీలు : మద్రాసు, కోమల విలాస్, 5 ప్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్, (జి. టి.), 13 వ తేదీ : నెల్లూరు రాఘవ విహార్, 14వ తేదీ ఒంగోలు, అభిలాష్ లాడ్జి, 15వ తేదీ: గుంటూరు, ఉడిపి శ్రీకృష్ణభవన్, స్టేషనురోడ్డు, 16, 17 తేదీలు : వైజాగ్, బృందావన్ లాడ్జి, డాబా గార్డెన్స్, 18, 19 తేదీలు : రాజమండ్రి, శాంతి నివాస్ లాడ్జి, 20వ తేదీ : కాకినాడ, శాంతినివాస్ లాడ్జి, గవర్నమెంటు హాస్పిటల్ ఎదుట, 21వ తేదీ : ఏలూరు, హోటల్ మధులత, 22, 23 తేదీలు : విజయవాడ, మోడరన్ కేఫ్, గాంధీనగర్, 24వ తేదీ : ఖమ్మం మయూర్ కేఫ్, (శేషమహల్ లాడ్జి), 25వ తేదీ : వరంగల్, నటరాజ్ హోటల్, 26వ తేదీ నుండి హెడ్డాఫీసు.

SWASTIK

న్నాడు శ్రీపతి. వర్షం మూలంగా సెలవు పెట్టి ఊరికే ఇంట్లో కూర్చోడం ఇష్టంలేదు. లీవు పెడితే రేపు మళ్ళీ ఆఫీసులో దానికి సంజాయిషీ ఇచ్చుకోవాలి. అయినా లీవు పెట్టి రోజంతా రేవతిని చూస్తూ ఇంట్లో కూర్చోనూ లేడు. ఎత్తుగా పెరిగిన పొట్టతో భారంగా తిరుగున్న రేవతిని చూస్తోంటే ఎలాగో వుంది శ్రీపతికి. రేవతిని తీసుకు వెళ్ళమని వాళ్ళ అమ్మకి ఉత్తరం రాశాడు శ్రీపతి. బహుశ వచ్చేవారం లోగా వచ్చి తీసుకు వెళ్ళవచ్చును కున్నాడు.

"నాన్నా టిమిడ్ అంటే ఏమిటి?"

ఉలిక్కిపడి చూశాడు శ్రీపతి. ఏడేళ్ళ సీను ఎదురుగానుంచుని చెయ్యి కుదుపుతూ అడుగుతున్నాడు. ఏమిటన్నట్లు చూశాడు శ్రీపతి.

"టిమిడ్ అంటే ఏమిటి నాన్నా?" మళ్ళీ అడిగాడు సీను.

కింద పడిన పేపరు అందుకున్నాడు శ్రీపతి.

"టిమిడ్ టి. ఐ. ఎం. ఐ. డి టిమిడ్ అంటే పిరికిఅన్నమాట"చెప్పాడు. శ్రీపతి సీనుకి అర్థం అయినట్లు లేదు. కదలకుండా అక్కడే నుంచున్నాడు.

"పిరికి అంటే?" అడిగాడు మళ్ళీ.

"పిరికి అంటే.... పిరికితనం.... అంటే భయం అన్నమాట. ధైర్యం లేకపోవడం, భయపడ్డం అన్నమాట" అర్థమయేలా చెప్పడానికి ప్రయత్నించాడు శ్రీపతి.

"ఓ అదా తెలిసింది. అంటే పక్కింటి వాసులాగా అన్నమాట. వాడికి బల్లి అంటే చచ్చేభయం. అలాగే మాస్టారంటే" అనేసి అక్కడ్నించి వెళ్ళిపోయాడు సీను.

"నాలాంటివాడు" అని చెప్పాలనుకుని చెప్పకుండా ఊరుకున్నాడు శ్రీపతి.

రేవతి పిల్లలకి అన్నాలు పెడుతోంది.

చిన్నప్పుడుఅమ్మ అనేది "ఒట్టిఅమాయకుడు వీడెలా బతుకుతాడో" అని, "నీ కొడుకు అమాయకుడేం కాదు. పైకి అలా కనిపిస్తాడుగానీ, వాడికి అన్నీతెలుసు" అనే వాడు నాన్న. తనంటే నాన్నకి ఎందుకో నాన్నకి అన్నయ్యలంత ఇష్టం ఉండేది కాదని ఆ వయసులోనే శ్రీపతి అర్థంచేసుకున్నాడు.

కానీ మహలక్ష్మికి తనంటే చాలాఇష్టం. మహలక్ష్మి తన స్కూలుకి దగ్గర ఒక ఇంట్లో ఉండేది. రోజూ బడికి వెళ్ళేటపుడు పిలిచి బిళ్ళలూ• చాక్లెట్లూ ఏదో ఒకటి పెట్టేది. ఒక రోజు శ్రీపతి అడిగాడు.

"నువ్వు ఎవరు?" అని.

మహలక్ష్మి నవ్వి తనని దగ్గరగా తీసుకుని ముద్దుపెట్టుకుంటూ.

"మీ అమ్మని" అంది. శ్రీపతికి అర్థం కాలేదు. ఆ రోజు సాయంకాలం తండ్రిని అడిగాడు.

"నాన్నా నాకెంతమంది అమ్మలు?" అని.

నాన్న తనకేసి తీక్షణంగా చూసి "ఇంకా నయం నాకెంతమంది నాన్నలు అనడగ లేదు. "వేలెడులేవు వెధవానీకెందుకివన్నీ?" అంటూ వీపు మీద ఒక్కటి అంటించి వెళ్ళిపోయాడు.

"అవేం మాటలు బాబూ తప్పుకదూ" అంది అమ్మ.

ఆ మాటలకి అర్థం అప్పుడు తెలియక పోయినా తర్వాత తెలిసింది రోజూ రాత్రుళ్ళు తండ్రి ఎక్కడికి వెళ్ళి వస్తుంటాడో, దేవతలాంటి అమ్మని కారణం లేకుండా ఎందుకు చావగొడుతుంటాడో, ఊళ్ళో అందరూ తనని తేలిగ్గా ఎందుకు చూస్తుంటారో. కానీ ఎదురు తిరిగి అడగలిగే వయసు వచ్చేనాటికి తండ్రి చచ్చిపోయి తప్పించుకున్నాడు. తండ్రిని అడగాలనుకున్న మాటలన్నీ శ్రీపతి మనసులోనే మిగిలి పోయాయి.

"అన్నం వడ్డించాను రండి" పిలిచింది రేవతి.

శ్రీపతి లేచి లోపలికి నడిచాడు. గబగబా నాలుగుముద్దలు తిని గొడుగు తీసుకుని ఆఫీసుకు చేరుకున్నాడు. శ్రీపతి ఆఫీసుకి వచ్చేటప్పటికే అక్కడంతా గొడవగా ఉంది. వెళ్ళగానే ఆఫీసరు పిలుస్తున్నాడని కబురొచ్చింది. లోపలికి వెళ్ళిన శ్రీపతిని కస్టమర్స్ ఎదురుగానే ఆ ఫైలెందుకు కదల్లేదంటూ చీవాట్లేసి వెంటనే వాళ్ళ లెటర్ని ఫార్వర్డ్ చెయ్యమని వార్నింగిచ్చాడు ఆఫీసరు.

శ్రీపతికి తెలుసు ఏదో లేందే ఆ ఫైలుని ఆఫీసరు తియ్యమని చెప్పడు. ఆ ఫైలు కదలడానికి నెల రోజుల క్రితమే తనకి ఎవరో లంచం ఇవ్వజూశారని దాంతో అసలు ఆ ఫైలుని చూడకుండా పక్కన పెట్టేశాననీ ఆఫీసరుకి చెబుదామనుకున్నాడు కానీ చెప్పలేక పోయాడు. తను చెబుదామనుకున్నవన్నీ మనసులోనే అనుకుని ఆఫీసరు చేత అనవసరంగా మాటలు పడి బయటికొచ్చాడు.

ఆ సాయంత్రం ఇంటికి వస్తుంటే దార్లో మల్లెపూలు కనిపించినై. రేవతికి మల్లెపూలు ఇష్టం. కొత్తలో రోజూ మల్లెపూలు కొని తీసుకెళ్ళేవాడు. ఈ మధ్య కొనాలనిపించడంలేదు. ప్రతి శుక్రవారం మాత్రం కొని పట్టుకెళుతున్నాడు. ఆవాళ శుక్రవారం అయినా పూలు కొనాలనిపించలేదు శ్రీపతికి. అలా అని కొనకుండానూ వుండలేకపోయాడు. కొన్ని పన్లు ఇష్టంలేకపోయినా కొందరికోసం చెయ్యక తప్పదు. పావలా పూలుకొని ఇంటికి వచ్చాడు. పూల పొట్లం చూడగానే రేవతి ముఖం వికసించింది.

"మీరెంత మంచివారండీ" అంది షర్టు చేతుల గుండీలు విప్పదీస్తూ. రేవతికి ఫుల్ హాండ్స్ చొక్కాలంటే ఇష్టం. పెళ్ళయిన కొత్తలో ఒకసారి అడిగింది.

"మీరు ఫుల్‌హాండ్స్ షర్టులు ఎందుకు కుట్టించుకోరు?" అని.

"ఏమో నాకు అలవాటులేదు" అన్నాడు శ్రీపతి.

"ఏంకాదు. మీరు ఇకనుంచి అన్నీ ఫుల్ హాండ్స్ చొక్కాలే కుట్టించుకోండి" వాటిలోనే మనుషులు హుందాగా కనిపిస్తారు. రాజుకి చూడండి అన్నీ ఫుల్‌షర్టులే" అంది.

రాజు వాళ్ళ ఊళ్ళో మునసబుగా రబ్బాయని రేవతే చెప్పింది. ఇద్దరూ ఒకే స్కూల్లో కలిసి చదువుకున్నారట. ఆ


స్థాపితము ; 1962 ఫోను నెం. 22084

## కోరుకొండ సైనిక స్కూలు ప్రవేశ పరీక్షలు

(6 వ తరగతిలోనికి మాత్రమే)

**మీ అబ్బాయి వయస్సు జూలై 2, 1978 నాటికి 10 సం॥ 11 సం॥ మధ్యనున్నదా ?**

(అనగా పుట్టిన తేదీ 2-7-1967 పైన 1-7-1968 లోపు) అయితె వెంటనే త్వరపడండి. మీ అబ్బాయి చదువు-ఉజ్వల భవిష్యత్‌కు మధ్య తరగతి తల్లిదండ్రులకు అపూర్వ అవకాశము. గవర్నమెంటు అడ్మిషను పరీక్షలు పాసై స్కాలర్ షిప్‌తో పరీక్షలు.

షరా : షెడ్యూలు జాతులు వారికి, మాజీ సైనిక సిబ్బంది, సైనిక సిబ్బందివారికి ప్రత్యేక రిజర్వేషనులు. ఈ శిక్షణ విచ్చుటలో 16 సం॥ లుగా ప్రసిద్దిగాంచిన ప్రప్రధమ ఆదర్శ గురుకుల విద్యాసంస్థ.

# శ్రీ విద్యా విహార్

(ఆదర్శ గురుకుల విద్యాసంస్థ)

నవభారత్ గెస్టహౌస్ వద్ద

రింగురోడ్డు, **గుంటూరు-6**

పట్టణ వాతావరణమునకు దూరముగా ప్రశాంత వాతావరణములో నిర్మించబడిన ఆదర్శగురుకుల విద్యాసంస్థ బాలబాలికలకు ఇంటిని మరిపించు హాస్టలువసతి కలదు.

శిక్షణ తరగతులు : నర్సరి నుండి 10 వ తరగతి వరకు. 7 వ తరగతి, 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలు. మరియు హైదరాబాద్, ఋషివాలీ పబ్లిక్ స్కూలు స్కాలర్‌షిప్ పరీక్షలు, డెహరాడూన్ మిలటరీకాలేజి ప్రవేశపరీక్షలకు.

యం. వి. పూర్ణచంద్రరావు, B. A. B. T.
ప్రిన్సిపాల్.

యం. వి. లక్ష్మీప్రమీల, M.A.; Bed.
హెడ్ మిస్ట్రెస్.

SAVITA

# ఐటెక్స్
కాటుక & తిలకము

నాణ్యతలో గొప్పవి
అందమైన రంగులు










33 సంవత్సరముల అనుభవము వేరు విధముగ వుండుటకు వీలులేదు.

ARAVIND LABORATORIES
MADRAS-600 033

AL:T2


తర్వాత రాజు పై చదువులకని పట్నంవెళ్ళి పోయాడు. సెలవుల్లో మాత్రం ఊరు వచ్చే వాడు. అవన్నీ రేవతే చెప్పింది.

ఒకసారి శ్రీపతి షేవింగ్ చేసుకొంటుండగా కత్తెర పట్టు తప్పి ఓ పక్క మీసం వంకరపోయింది. అసహ్యంగా ఉందని పూర్తిగా తీసేశాడు. ఆఫీసులో వాళ్ళంతా రాజేష్ ఖన్నాలా ఉన్నా వన్నారు. కానీ రేవతి ఊరుకోలేదు.

"ఛ అదేవిటీ, మీసం లేకపోతే బాగోలేదు. మగాడికి మీసమే అందం. రాజు మీసాలు చక్కగా పెంచేవాడు. మీరికనుంచీ మీసం తియ్యడానికి వీల్లేదు. మగవాళ్ళు మీసం ఉంటేనే గంభీరంగా కనిపిస్తారు" అంది.

"పిల్లలు ఏరీ?" అడిగాడు శ్రీపతి.

"వాసూ వాళ్ళింట్లో ఆడుకొంటున్నారు." కాఫీ కప్పు చేతికిస్తూ అంది.

"అన్నయ్య ఉత్తరం రాశాడు. రేపు బండికి అమ్మ వస్తోందిట నన్ను తీసుకు వెళ్ళడానికి" ఉత్తరం తెచ్చిచ్చింది రేవతి.

ఉత్తరం అందుకుని పక్కనపెట్టాడు శ్రీపతి.

"అయితే ఎప్పుడు ప్రయాణం?" అడిగేడు.

"వెంటనే వెళ్ళాలంటుందేమో. ఆ తర్వాత రోజులు మంచివి కావట."

"ఊఁ" అన్నాడు శ్రీపతి సిగరెట్ ముట్టించి.

"ఏమండీ మనకి ఆడపిల్ల పుడితే ఏం పేరు పెట్టుకుందాం?" అడిగింది రేవతి ఆ రాత్రి.

శ్రీపతి మాట్లాడలేదు. బెడ్ లాంప్ చుట్టూ తిరుగుతున్న దీపం పురుగుల కేసి చూస్తున్నాడు.

"మిమ్మల్నే-ఏవిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది.

"ఏం లేదు. మొదటి సారి ఎవరైనా అబ్బాయి కావాలని కోరుకుంటారు," అన్నాడు.

"మనకి ముగ్గురు అబ్బాయి లున్నారు చాలదూ. అమ్మాయి అయితేనే బాగుంటుంది" అంది. శ్రీపతి ఆమె ముఖంలోకి చూశాడు. ఏ భావమూ కనబడలేదు.

సీతకి ఆడపిల్లలంటే ప్రాణం. మూడో వాడి కన్నీ ఆడపిల్ల డ్రెస్సులువేసి చూసుకుని మురిసిపోయేది. ఒకసారి రేవతితో చెప్పాడా విషయం. తన పిల్లల్ని సొంత పిల్లల్లా చూసుకుంటోంది రేవతి. తల్లి లేని లోటు ఎక్కడా కనిపించకుండా పెంచుతోంది. కానీ, రేవతి స్వయంగా తల్లి కాబోతోందంటే శ్రీపతి భరించలేకపోతున్నాడు. అతనికి ఏం చెయ్యాలో అర్థం కాకుండా ఉంది. మనసంతా చికాగ్గా ఎలాగో ఉంది. ఆలోచనల్తో తల పగిలిపోతోంది. ఏదో చెబుదామని రేవతి మొహంలోకి చూశాడు. కానీ చెప్పలేక ఎలా చెప్పాలో తెలీక ఊరుకునాడు. తన అశక్తతమీద తనకే కోపం వచ్చింది శ్రీపతికి.

◆ ◆ ◆

రేవతి పుట్టింటికి వెళ్ళిపోయింది.

శ్రీపతికి ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థం కావడం లేదు. ఎందుకిలా జరిగింది అన్నదే ప్రశ్న. తన అనుమానం నిరాధారమెందేం కాదు. ఏం చెయ్యడం? ఎవరితో చెప్పడం? రేవతి తన భార్య. ఆమె జీవితం తన చేతిలో ఉంది. అలాగే తన పరువూ, కుటుంబం బాధ్యత అన్నీ రేవతి మీద ఆధారపడి ఉన్నాయి కానీ. ఏమిటి చెయ్యడం?

చిన్నప్పటినుంచీ అసమర్థుడిగా జమకట్టి ఏడిపించేవారు అన్నయ్యలు. నిజమే. తను అసమర్థుడు. చాతకానివాడు. పిరికివాడు. ఎందుకూ పనికిరానివాడు. బ్రతకనేర్వనివాడు. బ్రతకడంకోసం నేర్చుకోవాలి. నేర్చుకోడానికి బ్రతకాలి. బ్రతుకంటే ఏమిటో పూర్తిగా బ్రతికితేనేగాని తెలీదు. ఆ సంగతి శ్రీపతికి అప్పుడు తెలీదు. ఇప్పుడు తెలుస్తోంది. అందుకే ఆనాడు అన్నయ్యలు చేస్తున్నది తప్పని తెలిసినా, ఏమీ అనలేకపోయాడు. రోజు ఇంటికి తాగి వచ్చే అన్నయ్యనీ, క్లబ్బుల్లో పేకాడే చిన్నయ్యనీసమర్థించలేకపోయాడు. తప్పని తెలిసీ ఎదురు చెప్పలేకపోయాడు.

శ్రీపతికి అసహనంగా వుంది. పిచ్చిగా వుంది. వెర్రిగా ఏదో చెయ్యాలన్నంత ఆవేశం వుంది. అన్నిటినీ మించి ఆలోచన వుంది. కానీ తనలోని బలహీనత అడుగడుగునా తనని వెంటాడుతోంది. జీవితంలో ఎందుకూ పనికిరానివాడుగా చేస్తోంది. చివరికి కన్న తల్లిని కూడా రక్షించుకోలేకపోయింది. తండ్రి పోయిం తర్వాత నలుగురు అన్నలూ, వంతులవారీగా తల్లిని పంచుకుని చూస్తోంటే సహించలేకపోయాడు. తన కాళ్ళమీద తను నిలబడగలిగినాడు.

"అమ్మ నాకు భారం కాదు. నేను చూస్తాను. అమ్మ నాతోనే వుంటుంది" అని చెప్పి అమ్మని తీసుకువెళ్ళి పోదామనుకున్నాడు. ఆ అవసరం రాకుండానే ఆమె ఈ లోకం నుంచి వెళ్ళిపోయింది. చెప్పాలనుకున్న మాటలన్నీ గొంతులోనే వుండిపోయాయి. చెయ్యాలనుకున్న పనులన్నీ చెయ్యకుండానే మిగిలిపోయాయి.

రేవతిని చేసుకున్నప్పుడే అందరితోనూ

చెబుదా మనుకున్నాడు. అందుకు ఇష్టపడి తేనే రేవతిని చేసుకుంటానని చెప్పాలనుకున్నాడు. కానీ చెప్పే అవకాశం ఇవ్వలేదెవ్వరూ. పెళ్ళయిపోయింది. చెప్పలేక పోయాననే బాధ శ్రీపతిలో మిగిలిపోయింది. కనీసం రేవతితోనైనా ఆ విషయంచెప్పాలని అవకాశంకోసం ఎదురు చూశాడు. రేవతికి పిల్లలంటే ప్రాణం.... ఒకసారి అడిగాడు.

"రేవతీ నీకు పిల్లలంటే అంత ఇష్టమా?" అని

"పిల్లలంటే ఏ ఆడదానికి ఇష్టంఉండదు చెప్పండి" అంది. దాంతో శ్రీపతి నోరు తక్కున మూతపడింది. చెప్పాలనుకున్నది చెప్పలేకపోయాడు. రేవతి తను చెప్పేది




.daCunha/CS./24h/TeL

విని భరించగలదా? ముగ్గురు పిల్లలు పుట్టగానే తను ఆపరేషన్ చేయించుకున్నానని. తనవల్ల రేవతికింక పిల్లలు పుట్టేఅవకాశం లేదని తెలిస్తే రేవతి భరించగలదా? ఆ సంగతి తెలిసీ ఓర్పుతో సహించి తనని క్షమించగలదా? ఆ షాక్ కి తట్టుకొనే మనోధైర్యం రేవతికి ఉందా? తనని మోసంచేసి చేసుకున్నాడని అనుకోదూ? అందుకే ఆ నాటి నుంచీ ఈనాటివరకూ రేవతి దగ్గర ఆ రహస్యాన్ని రహస్యంగానే ఉంచాడు శ్రీపతి.

కానీ ఇప్పుడు యిదేమిటి? ఎందుకిలా జరిగింది? తలబద్దలు కొట్టుకున్నా కారణం అర్థం కాలేదు శ్రీపతికి. ఆఫీసుకి సెలవుపెట్టి డాక్టరు దగ్గరికి వెళ్ళి వచ్చాడు. తన అనుమానం అనుమానం కాదనీ, నిజమనీ ఋచ్చితంగాతెలిసిపోయింది. రేవతితోతనవెళ్ళయి ఏడు నెలలు, అంతే, రేవతికి అప్పుడే నెలలు నిండాయి. అంటే.... జరిగిన మోసం ఊహించుకోగలిగాడు శ్రీపతి. అందరూ అంత తొందరపడి రేవతిని తనకి ఎందుకు కట్టారో అర్థమైంది. తను ఏదో చెప్పకుండా దాచి రేవతిని బాధపెడుతున్నాననీ, అన్యాయం చేస్తున్నాననీ కుమిలిపోయాడు, ఇన్నాళ్ళూ ఒక రకంగా రేవతిని మోసంచేసి చేసుకున్నట్లుగా ఊహించుకుని రేవతికి చెప్పకుండా మింగలేక, కక్కలేక బాధపడ్డాడు. కానీ తను మోసపోయానని ఆలస్యంగా ఇన్నాళ్ళకి తెలుసుకో గలిగేసరికి సమయం మించిపోయింది.

శ్రీపతికి ఆడపిల్ల పుట్టిందని టెలిగ్రాం వచ్చింది. మౌనంగా టెలిగ్రాం అందుకున్నాడు శ్రీపతి.

మూడు నెలల తర్వాత ముద్దుగా బొద్దుగా ఉన్న పాపని ఎత్తుకుని వచ్చింది రేవతి.

"మీ కూతురి పేరేమిటో తెలుసా? సీత:" అంది రేవతి పాపని శ్రీపతికి అందిస్తూ.

శ్రీపతి రేవతి వంక చూశాడు. ఆ తర్వాత పాపకేసి చూశాడు. రేవతి చేతుల్లో పాప సంతోషంగా చేతులూ. కాళ్ళూ కొట్టుకుంటోంది. శ్రీపతి ఏదో అందామనీ, ఎన్నో చెప్పాలనీ నోరు విప్పాడు. కానీ గొంతు పెగల్లేదు. అతను అనదల్చుకొన్న మాటలు మనసులోనే మిగిలిపోగా మౌనంగా చేతులుచాచి పాపను అందుకున్నాడు శ్రీపతి!




స్పెషల్
సినీ పజిల్
నెం-27

# విజయ సాహితి

[సినీ పజిల్]

మండపేట, తూ॥గో॥జిల్లా

## రు. 35000 లు గెలుపొందండి!

ఆల్ కరెక్టుకు రు. 25,000 లు. 1,2 తప్పులు రు. 6000
మినీ సాహితి రు. 4000

ముగింపు : 26-12-77
కీ సొల్యూషన్ : 1-1-78
ఆంధ్రజ్యోతి దినపత్రికలో

1 ఎంట్రీ 1-00    6 ఎంట్రీలు 4-00    25 ఎంట్రీలు 15-00

ప్రతి 6 ఎంట్రీలకు 1 మినీ సాహితి ఉచితం (మినీసాహితి 1,2,3,4,5,6 ప్రశ్నలు ఆల్ కరెక్టుకు మాత్రమే)

ఆధారములు : 1. ముగ్గురు 'పద్మశ్రీ'లు కలసి నటించిన చిత్రం– (జీవితచక్రం/చాణక్య చంద్రగుప్త) 2. జెమిని సంస్థ నిర్మించిన ఉత్తమ చిత్రం– (చంద్రలేఖ/అవ్వయార్) 3. ఈతడు దర్శకత్వం వహించిన మొదటి తెలుగు చిత్రమే 100 రోజుల పండుగ జరుపుకుంది. (భీమసింగ్/త్రిలోక్ చందర్) 4. ఈతడు నటించిన మొదటి చిత్రమే నంది అవార్డు అందుకుంది– (చంద్రమోహన్/కృష్ణంరాజు) 5. పద్మశ్రీ అయిన ఈ తారను N.A.T. సంస్థ తెలుగు తెరకు పరిచయం చేసింది– (సరోజాదేవి/వహిదారెహమాన్) 6. గయ్యాళి పాత్రలు పోషించే ఈ నటి ఇటీవల చాలా తక్కువ చిత్రాలలో నటిస్తుంది– (ఛాయాదేవి/సూర్యకాంతం) 7. ఎన్. టి. రామారావు దర్శకత్వంలో తయారైన ఈ చిత్రం ఆశించినంతగా ప్రేక్షకుల ఆదరణ పొందలేకపోయింది– (చాణక్య చంద్రగుప్త/కర్ణ) 8. "పద్మశ్రీ" భానుమతి ఈ చిత్రానికి దర్శకత్వం నెరపటమే కాకుండా రెండు పాత్రలు పోషించింది– (మనవడి కోసం/చండీరాణి) 9. తెలుగు తెరకు ఈమె నాట్యతారగా పరిచయం కాబడింది– (కాంచన/చంద్రకళ) 10. ప్రస్తుతం మళయాళ చిత్రాలు తయారవుతున్న "శ్యామలా" స్టూడియోలో ఈ తెలుగు చిత్రం తయారైనది– (ప్రియురాలు/పల్లెపడుచు) 11. హాస్య సంభాషణలు రాయటంలో ఈతనికి మంచి పేరు వుంది– (ముళ్ళపూడి/అప్పలాచార్య) 12. ఈ నటి పేరుతో తెలుగులో ఒక చిత్రం తయారైనది– (లక్ష్మి/జయప్రద).

నిబంధనలు : 1. మీరు కోరుకున్న పదములు వరుసగా వ్రాసి పంపండి. 2. రుసుము క్రాస్ చేయని I. P. O. ద్వారాగాని M. O. ద్వారాగాని పంపుతూ M.O. రశీదు తప్పక జతపర్చాలి. 3. M. O. రశీదు లేని ఎంట్రీలు, ముగింపు తేదీ దాటిన తరువాత చేరు ఎంట్రీలు పోటీకి తీసుకోబడవు. 4. మేనేజిమెంటువారిదే తుదినిర్ణయం. 5. స్టేట్ బ్యాంకు లాకరులో సీలు చేయబడి గ్రామాధికారుల సమక్షంలో తెరువబడే ప్రతిమాట ఒక తప్పుగా లెక్కించబడును. 6. విజేతల లిస్టుకు, పోటీ నెం-28 (సంక్రాంతి ప్రత్యేక కానుక) ఎంట్రీలకు 40 పైసల స్టాంపులు పంపండి. ఎంట్రీలు, M. O. లు

**VIJAYA SAHITHI, MANDAPETA,** E. G. Dt కు పంపండి.